సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం । 10 । ఆగస్టు । 2024



సోమశిలలో 15.783 టీఎంసీలు
సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 15.783 టీఎంసీలు ఉన్నాయి. పైనుంచి 10,983 క్యూసెక్కుల వరద వస్తోంది. దిగువకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.71,560
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,427
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,620
నవర (8 గ్రాములు)	రూ.52,960

వాతావరణం
గరిష్టం/కనిష్టం 37.5 /28.3
జిల్లాలో అక్కడక్కడ ఆకాశం మేఘావృతంగా ఉరుములు మెరుపులతో ఉంటుంది. మధ్యాహ్నం నుంచి వేడి వాతావరణం ఉండనుంది. గాలిలో తేమ 57 శాతం ఉంది.

అరాచకానికి పరాకాష్ట



టీడీపీ మూకల ఉన్మాద చర్య

దళితుల ఆరాధ్య దైవం అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ధ్వంసం టీడీపీ మూకల ఉన్మాద చర్యగా ఉంది. ప్రపంచం గర్వించే విధంగా విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తే దానిని చూసి ఓర్వలేక ఇలాంటి కుట్రపూరిత చర్యలకు పాల్పడడం సిగ్గు చేటు. అంబేడ్కర్ రాజ్యాంగంతో పదవులు అనుభవిస్తున్న టీడీపీ నాయకులు ఉన్మాదంతో ఊగిపోతున్నారు.

– బల్లి వెంకయ్య, మాలమహానాడు నేత, కోవూరు



అంబేడ్కర్ మహాశిల్పం ధ్వంసం చేస్తారా?

దేశం గర్వించే విధంగా విజయవాడ నడిబొడ్డున ఉన్న అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ధ్వంసం చేయడం దారుణం. రాత్రి వేళ పోలీసుల సాక్షిగా ధ్వంసం చేయడం చూస్తే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎంత అధ్వానంగా ఉన్నాయో భయం గొలుపుతోంది. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ప్రత్యర్థులపై దాడులు చేస్తూ సాగిపోతున్న టీడీపీ నేతలు ఇలాంటి దారుణాలకు పాల్పడడం ఆ పార్టీ నేతల కండ కావరానికి అద్దం పడుతోంది.

– ఎల్ అశోక్, ఉదయగిరి



రాష్ట్రంలోనే ఇటువంటి దారుణాలు

దేశానికి రాజ్యాంగాన్ని అందించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలపై దాడులు జరగడం, దళితులను అవమానించడం మన రాష్ట్రంలోనే జరుగుతున్నాయి. విజయవాడకే తలమానికంగా, యావత్‌భారతావని గర్వంగా చెప్పుకునేలా విజయవాడ నడిబొడ్డులో సగర్వంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయాలని ప్రయత్నించిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి.

– దైవాదీనం, అల్లూరు

టీడీపీ నేతలు ఉన్మాదంతో తాలిబన్ల కంటే దారుణంగా వ్యవహరిస్తున్నారు. బెజవాడ నడిబొడ్డున ఏర్పాటైన అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై పచ్చమూక సాగించిన చీకటి దాష్టీకం అరాచకానికి పరాకాష్టగా ఉందని విద్యార్థుల నుంచి.. విద్యావంతుల వరకు, మేధావుల నుంచి మహానుభావుల వరకు ఖండించారు. ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన రాజ్యాంగ శిల్పి అంబేడ్కర్ శిల్పం విధ్వంసానికి పూనుకున్న పచ్చమూకల ఉన్మాదంపై దళితులు భగ్గుమంటున్నారు. అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఏర్పాటుపై ఆది నుంచి విషం కక్కిన పచ్చజాతి.. ఇప్పుడు ఆ ఆనవాళ్లు లేకుండా చేసే కుట్ర జరుగుతుందని దళితులు ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నారు. ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలని కోరుతున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి పెనుముప్పుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.



నెల్లూరు వీఆర్సీ సెంటర్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు స్వర్ణ వెంకయ్య, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, గిరిజన జేఏసీ నేత పాలకీర్తి రవి తదితరులు

నిందితులను కఠినంగా శిక్షించాలి



విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై జరిగిన దాడి అమానుషం. కూటమి నేతలు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి తెగబడడం శోచనీయం. టీడీపీ నేతలు ఉన్మాదంతో చేసిన చేష్టగా కనిపిస్తోంది. పోలీసుల సాక్షిగా ఇలాంటి విధ్వంసానికి పాల్పడ్డారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతోనే ఆ పోలీసులకు ఉద్యోగాలు, ఈ టీడీపీ నేతలకు రాజ్యాధికారం వచ్చిందనే విషయాన్ని మరిచి పోవద్దు. టీడీపీ విచ్చలవిడి చర్యలు ప్రతి ఒక్కరూ ఖండించాలి.

– పాకం ప్రవీణ్, దళిత నాయకుడు, తోటపల్లిగూడూరు



తోటపల్లిగూడూరులోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న దళిత నాయకులు

బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడి అమానుషం

తోటపల్లిగూడూరు: విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై జరిగిన దాడి దారుణమని వైఎస్సార్‌సీపీ మండల నేత మన్నెం సుబ్రహ్మణ్యంగౌడ్ ఖండించారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. తొలుత తోటపల్లిగూడూరు, ఇస్కపాళెం సెంటర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పాలాభిషేకాలను నిర్వహించారు. సుబ్రహ్మణ్యం గౌడ్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అధికార కూటమి నేతలు ఆటవిక పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్ర ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎంబేటి శేషమ్మ, మాజీ జెడ్పీటీసీ మన్నెం చిరంజీవుల గౌడ్, స్థానిక ఎంపీటీసీ సభ్యులు రాయపు శీనయ్య, తాని తిరుపతి, ఎంబేటి సంధ్యారాణి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం హక్కులకు విఘాతం

వక్ఫ్ చట్టం–1995కు సవరణ చేపట్టడం ముస్లిం హక్కులకు విఘాతం కల్పించడమే అని ముస్లిం మైనార్టీ వర్గాలు మండిపడ్డాయి. యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్‌మెంట్, ఎఫీషియెన్సీ డెవలప్‌మెంట్ యాక్ట్–1995గా మార్చడం ద్వారా ప్రజల మధ్య అంతరాలు పెంచడమే అని అభిప్రాయపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఒక వర్గాన్ని అణగదొక్కడమే ఉద్దేశంగా ఉందన్నారు. ఈ బిల్లుకు తెలుగుదేశం పార్టీ మద్దతు ప్రకటించడం దారుణమన్నారు. వక్ఫ్ వ్యవస్థ స్వయం ప్రతిపత్తిని తగ్గించడం, సామాన్య ప్రజలకు వక్ఫ్ ప్రయోజనాలను దూరం చేయడమే అన్నారు.

హక్కులను కాలరాయొద్దు



రాజ్యాంగంలో పొందుపరిచిన మేరకు ముస్లింల హక్కులను కాలరాయకుండా రాజకీయ పార్టీలు అండగా ఉండాలి. వక్ఫ్ బోర్డులో జోక్యం చేసుకుని కేంద్ర ప్రభుత్వం సవరణలు చేసే ప్రయత్నం సరికాదు. వారి హక్కులను కాలరాయకుండా మైనార్టీలకు రక్షణగా పార్టీలు వారికి అండగా ఉండాలి. ముస్లింలు వ్యతిరేకించే ఈ బిల్లుకు టీడీపీ మద్దతు తెలియజేయడం విచారకరం.

– షేక్ జాకీర్, ఏఎస్‌పేట

ముస్లింల స్వేచ్ఛను కాపాడాలి



ముస్లిం మత స్వేచ్ఛను కేంద్ర ప్రభుత్వం నిర్బంధిస్తోంది. ప్రజల మధ్య చిచ్చుపెట్టేలా విభజించి పాలించేలా వ్యవహరిస్తోంది. ఎవరు కోరకుండా వక్ఫ్ చట్టంలో మార్పులు, సవరణలు చేయడం మంచి పద్ధతి కాదు. వారి మత స్వేచ్ఛలో జోక్యం చేసుకునేలా కేంద్రం ప్రయత్నం చేయడం దారుణం. ఇలాంటి క్రూరమైన బిల్లుకు టీడీపీ మద్దతు ప్రకటించడం ముస్లింలపై ఆ పార్టీది సవతి ప్రేమే.

– ఎస్కే ఖాదర్‌బాషా, ఏఎస్‌పేట

మైనారిటీల హక్కుల భగ్నంకు కుట్ర



రాజ్యంగం మైనార్టీలకు ఇచ్చిన హక్కులను తొలగించేందుకు కుట్ర పన్నడంలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టింది. ఈ బిల్లుకు రాష్ట్ర కూటమి ప్రభుత్వం మద్దతు తెలపడం సమంజసంగా లేదు. వక్ఫ్ వ్యవస్థ స్వయం ప్రతిపత్తిని తగ్గించడమే లక్ష్యంగా ఈ బిల్లు తయారైంది. వక్ఫ్ బోర్డు బిల్లును వైఎస్సార్‌సీపీ వ్యతిరేకించడం హర్షణీయం.

షేక్ మీరావలి, ఇమామ్, అమన్ మస్జీద్, కలిగిరి

మద్దతు ఉపసంహరించుకోవాలి



వక్ఫ్ సవరణ బిల్లుకు టీడీపీ ప్రకటించిన మద్దతును వెంటనే ఉపసంహరించుకోవాలి. ముస్లింల ప్రయోజనాలను, మసీదులు, దర్గాల ఆస్తులపై పెత్తనం చేసేలా కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లు సరికాదు. నిన్నటి వరకు ముస్లింల పక్షపాతి అంటూ చెప్పిన టీడీపీ ఏకపక్షంగా వ్యవహరించడం దారుణం. వెంటనే మద్దతు ఉపసంహరించుకుని ముస్లింలకు క్షమాపణలు చెప్పాలి. కొత్త వివాదాలు సృష్టించొద్దు.

– షేక్ యతీఫ్, బిట్రగుంట

వక్ఫ్‌బోర్డ్ ఉనికికే ప్రమాదం



వక్ఫ్‌బోర్డు ఉనికి దెబ్బతినే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీలు వ్యతిరేకించడం అభినందనీయం. ఎన్నో ఏళ్ల నుంచి వక్ఫ్‌బోర్డు పరిరక్షణలో వేల ఎకరాల భూములు ఉన్నాయని, వీటిని పరిరక్షించాల్సిన అవసరం ఉంది.

– మాబాషా, కందుకూరు

వక్ఫ్ బోర్డు బిల్లును వ్యతిరేకిస్తున్నాం



మా ఆస్తులపై పెత్తనం చేయడం కోసం ఏర్పాటైన ఈ బిల్లును మేము వ్యతిరేకిస్తున్నాం. ఇలాంటి బిల్లును గతంలో ఏ ప్రభుత్వం ప్రవేశ పెట్టలేదు. కేంద్రం ఇలాంటి బిల్లు ప్రవేశ పెట్టినప్పుడు వైఎస్సార్‌సీపీ సభ్యులు వ్యతిరేకించడం మంచి నిర్ణయం. టీడీపీ ముస్లిం హక్కులను పాతిపెట్టే చట్టానికి మద్దతు ఇవ్వడం విచారకరం.

– ఖాదర్‌బాషా, ఉలవపాడు

న్యూస్‌రీల్

జేసీగా కార్తీక్



నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా కొల్లాబత్తుల కార్తీక్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం విజయనగరం జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. తాజాగా జరిగిన బదిలీల్లో ఆయన్ను నెల్లూరు జేసీగా బదిలీ చేసింది.

పది మంది సీఐల బదిలీ

నెల్లూరు(క్రైమ్): గుంటూరు రేంజ్ పరిధిలో పది మంది సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా జిల్లాలోనూ పలువురు సీఐలు బదిలీ అయ్యారు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్ జీఎల్ శ్రీనివాసరావును బాపట్ల జిల్లా మార్టూరు సర్కిల్‌కు బదిలీ చేశారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కామరాజుగడ్డ సాంబశివరావును బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్‌కు, అక్కడ పని చేస్తున్న ఎల్.వీరానాయక్‌ను రేంజ్ కార్యాలయానికి, సీఐడీలో ఉన్న మద్ది శ్రీనివాసరావును సంతపేట పోలీస్‌స్టేషన్‌కు, అక్కడ పనిచేస్తున్న ఏ సుబ్బరాజును రేంజ్ కార్యాలయానికి బదిలీ చేశారు. బదిలీ అయిన వారు వెంటనే బదిలీ అయిన ప్రాంతాల్లో విధుల్లో చేరాలని ఐజీ ఆదేశించారు.

బాధ్యులపై క్రిమినల్ కేసులు

నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరు వైద్యారోగ్యశాఖకు సంబంధించి స్టాఫ్‌నర్సు ఉద్యోగాల నియామకంలో వెలుగులోకి వచ్చిన ఫోర్జరీ సంతకాలపై రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ స్పందించారు. ఇటువంటి ఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే వీటిపైన విచారణ కమిటీ వేశామని, త్వరలోనే బాధ్యులపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని మంత్రి హెచ్చరించారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య మాట్లాడుతూ అది నా సంతకం కాదని, ఫోర్జరీ చేశారన్నారు.

762 బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం 929 పొగాకు బేళ్లు రాగా 762 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను తిరస్కరించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. కిలోకు గరిష్ఠ ధర రూ.358, కనిష్ఠ ధర రూ.204 లభించింది. సగటు ధర రూ.291.25గా నమోదైంది. వేలంలో 13 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పన

- వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్
- పెద్దాస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ప్రారంభం

నెల్లూరు (అర్బన్): అన్ని ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేస్తున్నామని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రూ.80 లక్షలతో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్, బయ్యా సరోజనమ్మ డయాలసిస్ సెంటర్‌ను శుక్రవారం ఉదయం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1,200 మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నారని, ఇలాంటి వారి కోసం పినాకిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాతలు 6 పడకలతో కూడిన డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా నిర్వహణా ఖర్చులు సైతం భరించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కిడ్నీ కేసులు పెరుగుతున్నందున పొదలకూరు, వింజమూరులో డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. గతంలో ఎక్కువగా విద్య, వైద్య రంగానికి దాతలు చేయూత నిచ్చారన్నారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. బాలభవిత కేంద్రాన్ని (డైస్) పరిశీలించి తగిన సూచనలు చేశారు.



డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

సర్వజన ఆస్పత్రి అభివృద్ధికి కృషి

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి)లో వైద్యశాఖాధికారులు, డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందితో మంత్రి సత్యకుమార్‌యాదవ్ సాయంత్రం సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాల, పెద్దాస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మందులు, పరికరాలు కొరత లేకుండా చేస్తామన్నారు. డాక్టర్లు రోగులను నవ్వుతూ ప్రేమగా పలకరించాలన్నారు. కోవిడ్ సమయంలో ప్రభుత్వ డాక్టర్ల సేవలు వెలకట్టలేనివన్నారు. కొంతమంది సమయ పాలన పాటించడం లేదన్నారు. ఒకరిద్దరి వల్ల వ్యవస్థకు చెడ్డపేరు వస్తుందన్నారు. డాక్టర్లు లోపాలు సరిచేసుకుని మరింత బాధ్యతగా పేదలకు వైద్య సేవలందించాలన్నారు. డాక్టర్ పోస్టుల భర్తీతో పాటు ప్రమోషన్లు పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వసుంధరాదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ పెద్దాస్పత్రికి కావాల్సిన మౌలిక వసతులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు, రేడియాలజిస్ట్ లేక ఇబ్బందిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ రమేష్‌నాథ్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ కళారాణి, ప్రొఫెసర్లు డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ నరేంద్ర, డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై వేటు

కందుకూరు రూరల్: కందుకూరు మార్కెట్ యార్డులో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై వేటు పడుతోంది. ఒక్కొక్కరిని తొలగించి వారి స్థానాల్లో అధికార పార్టీ మద్దతుదారులను నియమించుకుంటున్నారు. ఇప్పటికే ముగ్గురిని తొలగించారు. యార్డు పరిధిలో కందుకూరు, కరేడు, తెట్టు వద్ద రెగ్యులర్ చెక్ పోస్టులు ఉన్నాయి. నరసాపురం, అలగాయిపాళెం వద్ద సీజనల్‌గా చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తారు. వీటిల్లో పని చేసేందుకు 10 మంది యార్డు అసిస్టెంట్లు, 7 పేయింగ్ అసిస్టెంట్లు, మార్కెట్ యార్డు కార్యాలయంలో ఒక డీఈఓ పోస్టు ఉంది. వీరంతా అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తుంటారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారిని తొలగించేందుకు అధికార పార్టీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారు. నేరుగా రంగంలోకి రాకుండా అవుట్‌సోర్సింగ్‌లో పనిచేసే కొందరు అనుకూలమైన వారితో డబ్బులు డిమాండ్ చేయిన్నారు. ఉద్యోగంలో కొనసాగించాలంటే రూ.2 లక్షలు ఇవ్వాలని, లేకపోతే ఉద్యోగానికి మానుకోవాలని ఒత్తిళ్లు పెంచుతున్నారు. అంత డబ్బు ఎక్కడ తెచ్చి కట్టాలని, ఉద్యోగంలో ఉన్నా కూడా అంత జీతం వచ్చే పరిస్థితి లేదని చిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇప్పటికే ముగ్గురు ఉద్యోగం మానేసినట్లు తెలుస్తోంది. వీరిలో ఇద్దరు పదేళ్ల నుంచి విధుల్లో ఉండగా, ఒకరు ఐదేళ్ల నుంచి పని చేస్తున్నారు. ఈ విషయమై మార్కెట్ యార్డు ఇన్‌చార్జ్ కార్యదర్శి నారాయణను వివరణ కోరగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించాలని మాకు ఎవరి నుంచి ఒత్తిళ్లు లేవన్నారు. ఆ ముగ్గురు విధులకు రావడం లేదు. వారు ఎందుకు రావడం లేదో మాకు పూర్తి సమాచారం లేదన్నారు.

అక్కడికక్కడే పరిష్కరిస్తాం

- మంత్రి నారాయణ

నెల్లూరు(దర్గామిట్ట): ప్రజల కోసమే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రారంభించామని, ఈ వేదికలో వినతులు తీసుకోవడమే కాదని, వాటికి స్పాట్‌లోనే పరిష్కారం చూపుతున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. నెల్లూరు కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, కమిషనర్ సూర్యతేజతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలువురు బాధితులు మా సమస్యను పరిష్కరించాలంటూ మొరపెట్టుకున్నారు. మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సుమారు 50 మంది అర్జీలు అందజేశారన్నారు. వాటిలో కొన్నింటిని స్పాట్‌లోనే పరిష్కరించామన్నారు. మరికొన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించామన్నారు. ఏదో అర్జీ తీసుకున్నాము.. అయిపోయిందనే విధంగా కాకుండా బాధితులు అందించే ప్రతి అర్జీని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. టిడ్కో ఇళ్లపై ఇప్పటికే సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. వాటన్నింటిని పరిశీలించమని మంత్రులందరికీ ఆదేశాలు జారీ చేశారన్నారు. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలేది లేదని తనదైన శైలిలో హెచ్చరించారు. తణుకులో టీడీఆర్ బాండ్లలో సుమారు రూ.700 కోట్ల దుర్వినియోగానికి పాల్పడ్డారని, ఇప్పటికే దానిపై విచారణ జరుగుతోందని, విచారణ నివేదిక వచ్చిందని, దానిని కూడా సీఎంకు పంపించామన్నారు. వీటన్నింటిపై పూర్తి స్థాయిలో విచారించి లీగల్‌గా చర్యలు తీసుకుంటామన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి నారాయణ తదితరులు

11న జిల్లా స్విమ్మింగ్ జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు జిల్లా సిమ్మింగ్ జట్ల ఎంపిక ఈ నెల 11న ఉదయం 9 గంటలకు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరుగుతుందని స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుంకర మధు, కె.సనత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 ఏళ్లు పైబడిన, స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు కార్డు కలిగిన క్రీడాకారులు ఇందుకు అర్హులని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు పల్నాడు జిల్లాలో ఈ నెల 25వ తేదీ 10వ సీనియర్ రాష్ట్రస్థాయి అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. స్విమ్మింగ్ అసోసియేషన్ ట్రెజరర్ ఎస్. శివశంకర్‌రెడ్డిని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. స్విమ్మింగ్ డీఎస్ఏ కోచ్ డి.నాగరాజు ఫోన్‌నంబర్ 8801916198లో సంప్రదించవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశానికి మరోమారు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(టౌన్): ఐటీఐలో రెండో విడతలో భర్తీ కాని సీట్లకు మూడో విడతగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 26వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు ఏ ఐటీఐ చేరదలుచుకున్నారో ఆ ఐటీఐలో ఈ నెల 27వ తేదీ లోపు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను ధ్రువీకరణ చేయించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు ఈ నెల 29న, ప్రైవేట్ ఐటీఐలో చేరేందుకు 31న జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు.

టీ దుకాణం దగ్ధం చేసి ఏం సాధిస్తారు?

కందుకూరు: టీ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు మునగాల కృష్ణారెడ్డి జీవనోపాధిని దెబ్బతీసే విధంగా దుకాణాన్ని తగలబెట్టడం హేయమైన చర్య అని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఆ దుకాణాన్ని బుర్రా పరిశీలించి, కృష్ణారెడ్డిని పరామర్శించారు. టీడీపీ నాయకులు అనేక దాడులు చేస్తున్నారని దానిలో భాగంగానే ఇది జరిగి ఉంటుందనే అనుమానం వ్యక్తం చేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 98
లేయర్ (లైవ్)	: 90
బ్రాయిలర్ చికెన్	: 190
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 210
లేయర్ చికెన్	: 153

నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.100
సన్నవి	: రూ.80
పండ్లు	: రూ.60



ఉపాధి కూలిలో కమీషన్ల దందా

అధికార పార్టీ నాయకుల నిలువు దోపిడీ

- ఒక్కో కూలీ వారానికి రూ.100 ఇస్తేనే ఫుల్ మస్టర్
- ఈ నగదు కోసం ఫీల్డ్ అసిస్టెంట్లు, నేతల మధ్య ఘర్షణలు
- పట్టించుకోని అధికారులు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కందుకూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) పనుల్లో వసూళ్ల పర్వం మూడు పువ్వులు... ఆరు కాయలుగా కొనసాగుతోంది. కందుకూరు మండలంలోని 19 పంచాయతీల్లో సరాసరిగా రోజుకు 2,800 మంది కూలీలు పనులకు వెళుతుంటారు. వర్షాలు పడినప్పుడు కూలీలు సంఖ్య తగ్గుతుంది. అయితే నూతన ప్రభుత్వం ఏర్పడగానే ఫీల్డ్ అసిస్టెంట్ల మార్పు జరిగింది. గతంతో ఫీల్డ్ అసిస్టెంట్లు అన్నీ తామై పనులు చేయిస్తుండేవారు. కానీ ప్రస్తుతం కందుకూరు మండలంలో నూతన విధానానికి తెర లేపారు. గతంలో మాదిరిగా గ్రూపులు, మేట్లు విధానం లేకపోవడంతో అధికార పార్టీ నాయకులు మస్టర్లు తీసుకెళ్లి వారికి ఇష్టం వచ్చిన వారిని పనికి పిలవడం, హాజరు వేసుకోవడం చేస్తున్నారు. ఒక పంచాయతీలో కాలనీల వారీగా అధికార పార్టీ నాయకులు మస్టర్లను తీసుకెళ్తున్నారు. వారే ఆ కూలీలపై పెత్తనం చెలాయిస్తున్నారు. ఇలా కూలీలపై పెత్తనం చేసి డబ్బులు వసూలు చేసుకునేందుకు పోటీ పడుతున్నారు. ఇచ్చిన కొలతల ప్రకారం పని చేస్తే రోజుకి గిట్టుబాటు కూలీ రూ.300. అయితే కొలతల ప్రకారం పని చేసినా లేయకపోయినా రూ.270 నుంచి రూ.280 వరకు కూలీ వేయాలంటే ఒక కూలీ వారానికి రూ.100 మస్టర్లు తీసుకొచ్చిన నాయకుడికి ఇవ్వాలి. ఇలా ఎవరికి వారూ డబ్బులు వసూలు చేసుకొని ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఇవ్వడం లేదు. దీంతో ఆయా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, నాయకుల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంటోంది. అయితే ఓగూరు పంచాయతీలో ఎక్కువగా వసూలు చేసి ఇటు ఫీల్డ్ అసిస్టెంట్‌కు, ఉపాధి హామీ అధికారులకు ఇవ్వలేదు. దీంతో వారి మధ్య వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రస్తుతం ఈ వ్యవహారం ఉపాధి కార్యాలయానికి చేరింది.

చర్యలు తీసుకుంటాం

కూలీల వద్ద నుంచి వంద రూపాయలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై పరిశీలిస్తున్నాం. గ్రామాల వారీగా తనిఖీలు నిర్వహించి వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం.

– ఎల్.సుజాత, ఏపీఓ

మేమెందుకు ఇవ్వాలి?

అధికార పార్టీకి చెందిన కూలీలు తాము లంచం ఎందుకు ఇవ్వాలి. తామంతా అధికార పార్టీకే ఓట్లు వేశాం కదా అని అడ్డం తిరుగుతున్నట్లు సమాచారం. ఏ పార్టీ అయినా ఫుల్ కూలీ ఇవ్వాలంటే రూ.100 సమర్పించుకోవాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నారు. 10–20 మంది కూలీలను బ్యాచ్‌గా మాట్లాడుకొని మస్టర్లు తీసుకునేందుకు పోటీలు పడుతున్నట్లు తెలుస్తోంది. కొన్ని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన కూలీలకు పనులు పెట్టడం లేదు. డిమాండ్ పెట్టి మస్టర్లు తీసుకెళుతోంది అధికారి పార్టీ నాయకులే అవడంతో వైఎస్సార్‌సీపీకి చెందిన కూలీలను పనికి పిలవడం లేదు. దీంతో తమకు పనులు కల్పించాలని పలుకూరు పంచాయతీలోని పంటవారిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మద్దతుదారులు కార్యాలయానికి వస్తున్నారు. అయితే ఓ గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు దీనిపై అధికారులకు ఫిర్యాదు చేయగా వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ మృతి

- మరో ఇద్దరికి గాయాలు



స్ట్రెచర్‌పై ఆవులయ్య మృతదేహం

మనుబోలు: రోడ్డు ప్రమాదంలో పాస్టర్ మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని కొండూరుసత్రం వద్ద జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు... ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం కుంట గ్రామానికి చెందిన ఓర్సు కిరణ్ అనారోగ్యానికి గురికావడంతో అక్కడే పాస్టర్‌గా పనిచేస్తున్న ఆవులయ్య (52), డ్రైవర్ ఓర్సు వెంకటేష్‌తో కలిసి కిరణ్‌ను కారులో చెన్నై సమీపంలోని రాయవేలూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం ముగ్గురు తిరుగు ప్రయాణమయ్యారు. కొండూరుసత్రం వద్ద రోడ్డు వారగా ఆగివున్న లారీని వేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ పక్కనే కూర్చుని వున్న ఆవులయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కిరణ్, వెంకటేష్‌లకు గాయాలవగా 108లో చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు. మృతుడు ఆవులయ్యకు భార్య, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రక్కు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడి మృతి



నెల్లూరు (క్రైమ్): బొలేరో ట్రక్కు ముందు టైర్ పగలడంతో అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లి గుర్తుతెలియని వృద్ధుడిని ఢీకొనడంతో ఆయన మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. గుర్తుతెలియని వృద్ధుడు (60) సుందరయ్య కాలనీ జంక్షన్ వద్ద జాతీయ రహదారి డివైడర్‌పై గురువారం రాత్రి నిద్రపోయాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత విజయవాడ నుంచి చెన్నై వైపు వెళుతున్న బొలేరో ట్రక్కు ముందు టైర్ పగలడంతో డివైడర్‌పైకి దూసుకెళ్లింది. డివైడర్‌పై నిద్రిస్తున్న వృద్ధునిపై నుంచి వాహనం వెళ్లడంతో అతని కాళ్లకు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న ప్రయాణికులు వృద్ధుడిని జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. సౌత్ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యతోనే గిరిజనుల అభ్యున్నతి

- జెడ్పీ చెర్మ్‌పర్సన్ అరుణమ్మ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, కలెక్టర్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): గిరిజనులందరూ చదువుకుని అభ్యున్నతి చెందాలని జెడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని నగరంలోని బీవీ నగర్‌లో గిరిజన సంక్షేమ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జెడ్పీ చెర్మన్‌ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతి, కలెక్టర్ ఒ.ఆనంద్, ఐటీడీఏ అధికారులు, గిరిజన సంక్షేమ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతోనే ఏదైనా సాధ్యమనే విషయాన్ని గిరిజనులకు అర్థమయ్యేలా వివరించి వారి ఉన్నతికి అందరూ తమ వంతు కృషిచేయాలన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా ఉన్న ఎస్టీలకు బర్త్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులను ఇప్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ పరిమళ, ఏపీఓ జ్యోత్స్న, గిరిజన సంఘాల నాయకులు కల్లూరి చిన్న పెంచలయ్య, పులి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ సంతోషరావు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు అంతరాయాలు లేని విద్యుత్ అందించటమే లక్ష్యంగా విధులు నిర్వహించాలని ఆ సంస్థ సీఎండీ కె సంతోషరావు అధికారులను ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్‌లోని స్కాడా కార్యాలయ భవనంలో శుక్రవారం ఆయన విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచేలా వినియోగరులకు అవగాహన కలిగించి పీఎం సూర్యఘర్ సౌర విద్యుత్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో చీఫ్ జనరల్ మేనేజర్లు, కోట శేఖర్ రాజ ధర్మ జ్ఞాని, పద్మ, జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

- చైర్‌పర్సన్‌తో పాటు జెడ్పీటీసీలందరూ విపక్షం
- మంత్రులు, శాసనసభ్యులు అధికారపక్షం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాపరిషత్ చైర్‌పర్సన్‌తో పాటు జిల్లాకు సంబంధించిన 45 మంది జెడ్పీటీసీలూ విపక్షం, ముగ్గురు శాసనమండలి సభ్యులూ అదే పక్షం. అయితే ఇద్దరు మంత్రులతో పాటు మిగిలిన అందరు శాసనసభ్యులు అధికార పక్షం. జిల్లా పరిషత్ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా భిన్న పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో శనివారం సర్వసభ్య సమావేశం జరగనుంది. అధికార తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు సమావేశానికి హాజరవుతుండగా ముగ్గురు ఎమ్మెల్సీలతో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన 45 మంది జిల్లా పరిషత్ సభ్యులు వైఎస్సార్సీపీకి చెందిన వారు కావడంతో ఈ సమావేశానికి ఓ ప్రత్యేకత నెలకొంది. ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ రాష్ట్ర మంతురల హోదాలో సమావేశానికి హాజరుకానున్నారు. మరి సమావేశంలో ఆరోజు ఎలాంటి అంశాలు ప్రస్తావనకు వస్తాయో నన్న ఉత్కంఠ ఇప్పుడు రాజకీయ వర్గాలలో సర్వత్రా నెలకొని ఉంది.

ఉచితంగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి నారాయణ తదితరులు

నెల్లూరు(దర్గామిట్ట): కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఈ నెల 15 నుంచి ప్రభుత్వం ఉచితంగా నిర్వహించనుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో కేన్సర్‌పై అవగాహన కల్పించే పోస్టర్లను కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, ఇన్‌చార్జి జేసీ సూర్య తేజ, తదితరులు పాల్గొన్నారు.

బాలికకు మాయమాటలు చెప్పి..

- గర్భిణిని చేసిన కేసులో నిందితుడి అరెస్ట్

కోవూరు: తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ గిరిజన బాలికకు మాయమాటలు చెప్పి లోబరుచుకుని గర్భిణిని చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసులు తెలిపారు. కోవూరు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. గుమ్మళ్లదిబ్బ గ్రామానికి చెందిన కత్తి శ్రీనువాసులు అదే ప్రాంత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికకు మాయమాటలు చెప్పి లోబరుచుకుని గర్భవతిని చేశాడు. బాలికకు నలతగా ఉండటంతో కుటుంబ సభ్యులు నెల్లూరులోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్ష చేసిన వైద్యులు బాలిక అయిదు నెలల గర్భవతి అని తెలిపారు. దాంతో తల్లిదండ్రులు బాలికను నిలదీయడంతో జరిగినదంతా తెలిపింది. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి నిందితుడు కత్తి శ్రీనివాసులును అరెస్ట్ చేసినట్లు రూరల్ డీఎస్పీ తెలిపారు. ఫిర్యాదు అందిన గంటల్లోనే నిందితుడిని అరెస్ట్ చేసిన ఎస్ఐ రంగనాథ్‌గౌడ్‌ని అందుకు సహకరించిన సిబ్బందిని ఆయన అభినందించారు.

భారీగా ఎస్సైల బదిలీ

నెల్లూరు(క్రైమ్): జిల్లావ్యాప్తంగా వివిధ పోలీసుస్టేషన్లలో పనిచేస్తున్న 22 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ జి.కృష్ణకాంత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారు వారికి కేటాయించిన ప్రాంతాల్లో వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు.

ఎస్సై పేరు	ప్రస్తుతం	బదిలీ ప్రాంతం
పి.ఆదిలక్ష్మి	జలదంకి	దుత్తలూరు
ఎం.ఉమాశంకర్	దుత్తలూరు	కలిగిరి
సి.సంతోష్‌రెడ్డి	కలిగిరి	వీఆర్, నెల్లూరు
కె.భోజ్యా	బిట్రగుంట	కొండాపురం
బి.మహేంద్ర	కొండాపురం	వీఆర్, నెల్లూరు
కె.నాగార్జునరెడ్డి	సంగం	ఇందుకూరుపేట
జి.వీరేంద్రబాబు	ఇందుకూరుపేట	టి.పి.గూడూరు
జంపాని కుమార్	టి.పి.గూడూరు	దగదర్తి
కె.మరిడినాయుడు	దగదర్తి	కందుకూరు టౌన్
ఎ.ఆనందభాస్కర్	కందుకూరు టౌన్	విఆర్, నెల్లూరు
బి.బాల మహేంద్రనాయక్	ఒలేటివారిపాళెం	కందుకూరు రూరల్
పి.నరేష్	కందుకూరు రూరల్	విడవలూరు
ఎం.రాజా	విడవలూరు	వీఆర్, నెల్లూరు
టి.విశ్వనాథ్‌రెడ్డి	మర్రిపాడు	ముత్తుకూరు
ఎం. శివశంకరరావు	నార్త్ ట్రాఫిక్	రాపూరు
జె.మాల్యాద్రి	రాపూరు	వీఆర్, నెల్లూరు
పి.శ్రీనివాసులురెడ్డి	అల్లూరు	ఆత్మకూరు పీఎస్ (ఎస్సై-1)
కె.ముత్యాలరావు	ఆత్మకూరు పీఎస్(ఎస్సై-1)	వీఆర్, నెల్లూరు
ఎ.సైదులు	చిన్నబజారు	ఏఎస్ పేట
కె.ప్రసాద్‌రెడ్డి	ఏఎస్ పేట	వీఆర్, నెల్లూరు
పి.అనూష	సీతారామపురం	సోమశిల
వి.సుబ్బారావు	సోమశిల	వీఆర్, నెల్లూరు